రంగనహట్టి చెరువులో ముగ్గురి గల్లంతు

బెంగళూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జనం వేళ విషాదం చోటు చేసుకుంది. తుమకూరు జిల్లా మారసంద్ర సమీపంలోని రంగనహట్టి చెరువులో వినాయక నిమజ్జనం చేస్తుండగా ప్రమాదవశాత్తు తండ్రీకొడుకుతో పాటు మరొకరు గల్లంతయ్యారు. ఆదివారం దండినశివర పోలీస్ స్టేషన్ పరిధిలోని చెరువులో జరిగిన ఈ ప్రమాదంలో తండ్రి రేవణ్ణ (50), కుమారుడు శరత్ (20)తోపాటు మరో వ్యక్తి దయానంద్ (28) నీట మునిగి గల్లంతు అయ్యారు. స్థానికులు పోలీసులు, అగ్నిమాపకశాఖకు సమాచారం ఇచ్చారు. వారి ఆచూకీ కోసం పోలీసులు గాలింపు చేపట్టారు.



బీదర్ జిల్లాలో విద్యార్థినులు



బెళగావిలోని సువర్ణసౌధ వద్ద మంత్రులు..

ప్రజాహారం

ప్రజాస్వామ్య దినోత్సవం సందర్భంగా భారీ మానవహారం

2500 కి మీ | **31** జిల్లాలు | **25** లక్షల మంది



డప్పు కొట్టి ప్రారంభిస్తున్న సీఎం

బెంగళూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాస్వామ్య దినోత్సవాన్ని పండగలా నిర్వహించారు. విద్యార్థులు, ప్రజలు, ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొని భారీ మానవరంగా నిలబడి రాజ్యాంగ పరిరక్షణకు పిలుపునిచ్చారు. రాజ్యాంగ మార్గదర్శకమైన భిన్నత్వంలో ఏకత్వం దిశగా జీవిద్దామని సీఎం సిద్దరామయ్య పిలుపునిచ్చారు. అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా 2,500 కిలోమీటర్ల మానవహారంను లాంఛనంగా ప్రారంభించారు. విధానసౌధ ప్రాంగణంలో రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞ చేయించడం ద్వారా ప్రజాస్వామ్య దినోత్సవానికి శ్రీకారం చుట్టారు. ఇదే సందర్భంగా సీఎం మాట్లాడుతూ మన రాజ్యాంగం భిన్నత్వాన్ని, సమానత్వాన్ని, సమైక్యతను సూచిస్తోందన్నారు. సమాజాన్ని చీల్చాలనే దుష్టశక్తులను ఓడించడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని పటిష్టం చేయాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందన్నారు. బుద్ధ, బసవణ్ణ కాలంనుంచే ప్రజాస్వామ్య రాజ్యాంగ వ్యవస్థ ఉందన్నారు. అనుభవ మంటపమే ప్రజాస్వామ్యానికి పునాది అన్నారు. 1949 నవంబరు 25న చేసిన బాబా సాహెబ్ అంబేడ్కర్ ప్రసంగాన్ని సీఎం ప్రస్తావించారు. ఆర్థిక, సామాజిక ప్రజాస్వామ్యం అందరికీ లభించినప్పుడే రాజకీయ స్వాతంత్ర్యానికి అర్థం ఉంటుందన్నారు. తారతమ్యం ఆచరణ ఉండేదాకా రాజకీయ స్వాతంత్ర్యానికి అర్థం లేదన్నారు. రాజ్యాంగపీఠికలో అత్యంత నైతిక విలువలు ఉన్నాయన్నారు. ప్రతి పాఠశాల, కళాశాలలో చదివించి అర్థాన్ని వివరించి పాటించేలా చైతన్యం కలిగిస్తే భావితరాలకు అర్థవంతమైన ప్రజాస్వామ్యం సాధ్యం చేయవచ్చునన్నారు. సమాజంలో అసమానత ఉండేవరకు స్వాతంత్ర్యానికి అర్థం లేదన్నారు. ఏకతా భజన చేసే విచ్ఛిన్నకర శక్తులకు చెక్ పెట్టాలన్నారు. దళితులు, హిందువులు, మహిళల హక్కులు లభించాలంటే సమాజంలో శత్రువులను ప్రారద్రోలాలన్నారు. బీజేపీ, వారితో ఉండే విచ్ఛిన్నకర శక్తులు పేద, మధ్యతరగతి వర్గాలకు వ్యతిరేకులన్నారు. పేదల సంక్షేమానికి వీరు నిరంతర వ్యతిరేకమన్నారు. 20లక్షలమందికి పైగా మానవహారంలో భాగస్వామ్యులు చేయడం ద్వారా సమసమాజ ప్రచారానికి శ్రీకారం చుట్టామన్నారు. ఉత్సాహంగా పాల్గొన్నవారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాస్వామ్య రాయబారి హరేకళ హాజప్ప, పౌరకార్మికురాలు నాగలక్ష్మి మంజుళ, మంగళముఖి ప్రియాంకతోపాటు ఇద్దరు దివ్యాంగ విద్యార్థులతో కలసి మానవహారం నిర్వహించారు. విధానపరిషత్ సభాపతి బసవరాజ హొరట్టి, మంత్రులు మహదేవప్ప, ప్రియాంక ఖర్గే, కేజే జార్జ్, దినేశ్ గుండూరావులతోపాటు పలువురు పాల్గొన్నారు.



ధారవాడలో భారీ జాతీయపతాకం.. భారత దేశ చిత్రపటం ఆకారంలో



రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞలో సీఎం తదితరులు



విధానసౌధ వద్ద మానవహారంలో సీఎం తదితరులు

సువర్ణసౌధ ఉన్న బెళగావిలో ఏర్పాటైన కార్యక్రమంలో మంత్రులు సతీశ్ జార్కిహోళి, లక్ష్మి హెబ్బాళ్కర్, జిల్లాయంత్రాంగం పాల్గొన్నారు. పెద్దసంఖ్యలో విద్యార్థులు మానవహారంలో భాగస్వామ్యులు కావడంపై హర్షం వ్యక్తం చేశారు. రామదుర్గ తాలూకా సాలహళ్ళి నుంచి కిత్తూరులోని తేగూరు దాకా 145 కిలోమీటర్ల మేర మానవహారం కొనసాగింది. ఇక ధారవాడలో కన్నడపతాకంతో వందలాదిమంది మానవహారంగా ఏర్పాటు కావడం అందరినీ ఆకట్టుకుంది. ఇలా జిల్లా కేంద్రాల పరిధిలో అధికారులు అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మానవహారం జరిపారు. 25 లక్షలమందికిపైగా విద్యార్థులు, వివిధ శాఖల ఉద్యోగులు భాగస్వామ్యులయ్యారు. విజయనగరలో 40వేలమంది 40 కిలోమీటర్ల మేర మానవహారం జరిపారు. దక్షిణకన్నడలో 130 కిలోమీటర్ల, చిక్కమగళూరులో 192 కిలోమీటర్ల మేర మానవహారం సాగింది. సాంఘిక సంక్షేమశాఖ పర్యవేక్షణలో 34శాఖల సమన్వయంతో మానవహారం నిర్మించారు. ప్రతిచోటా విద్యార్థులే పెద్దసంఖ్యలో కనిపించారు.

గదగ్‌లో తేనెటీగల దాడి

గదగ్ జిల్లా లక్ష్మేశ్వరలో మానవహారంలో పాల్గొనేందుకు వచ్చిన విద్యార్థులపై బాళెహొసూరు సమీపంలో తేనెటీగలు దాడి చేశాయి. సుమారు 20మంది విద్యార్థులు, ఉపాధ్యాయులకు తేనెటీగలు కుట్టాయి. వందలాదిమంది విద్యార్థులు పరుగులు తీయడంతో కాస్త కలకలం రేగింది.



విధానసౌధ వద్ద..



బెళగావిలో మానవహారంలో విద్యార్థులు

32 ఎకరాల భూమి స్వాధీనం

● మాజీ మంత్రి సగీర్‌కు షాక్

బెంగళూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా భూమి కొనుగోలు చేసిన కాంగ్రెస్ మాజీ మంత్రి సగీర్ అహ్మద్ కుటుంబానికి ప్రభుత్వం షాక్ ఇచ్చింది. చిక్కమగళూరు జిల్లా చంద్రద్రోణ కొండలకు అనుబంధమైన షోలా అటవీప్రాంతంలో సగీర్ అహ్మద్ భార్య ఫాతిమాబీ పేరిట ఉన్న 32.21 ఎకరాల భూమిని జిల్లా యంత్రాంగం శనివారం స్వాధీనం చేసుకుంది. ఆ భూములపై సగీర్ కుటుంబానికి ఉన్న హక్కులను జిల్లా అధికారి మీనా నాగరాజ్ రద్దు చేస్తూ ఆదేశాలు ఇచ్చారు. ఇనాం దత్తాత్రేయ పీఠం గ్రామ సర్వే నెంబరు 5లో ఫాతిమాబీ పేరిట ఉండే బండిబాట, కాలిబాటపై హక్కులను జిల్లా యంత్రాంగం రద్దు చేసింది. ఈ భూమి ఇతరులకు మంజూరు కాగా 1978లో ఫాతిమాబీ పేరిట అక్రమంగా కొనుగోలు చేశారు. ఈ భూమి అక్రమంగా పొందారని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటున్నట్టు చిక్కమగళూరు హనుమంతప్ప సర్కిల్‌లోని సగీర్ అహ్మద్ ఇంటి తలుపులకు జిల్లా యంత్రాంగం నోటీసులు అతికించింది.

ప్రాసిక్యూషన్ అనుమతులపై నివేదిక ఇవ్వండి

● రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాలినికి గవర్నర్ గెహ్లాట్ లేఖ

బెంగళూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పాలనలో ఇప్పటివరకు ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులపై ప్రాసిక్యూషన్‌లకు అనుమతులు కోరుతూ లోకాయుక్త నుంచి వచ్చిన ప్రస్తావనలపై సమగ్ర సమాచారం ఇవ్వాలని గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ కోరారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాలిని రజనీశ్‌కు రాజ్‌భవన్ నుంచి లేఖ పంపారు. గవర్నర్ ఆదేశాలను అత్యవసరంగా పరిగణించాలని లేఖలో పేర్కొన్నారు. నమూనా ప్రకారం వివరాలను పొందుపరచాలని సూచించారు. ముడా ఇంటి స్థలాల అవినీతిలో సీఎం సిద్దరామయ్యకు ప్రాసిక్యూషన్‌కు అనుమతులను గవర్నర్ ఇచ్చిన తర్వాత వివాదమైంది. గవర్నర్ అనుమతులపై సీఎం హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. కాగా లోకాయుక్త నుంచి స్వీకరించబడిన వివాదాలు ఏ దశలో ఉన్నాయి, మంత్రివర్గ నిర్ణయాలను పొందుపరచాలని ఆదేశించారు. 2023 మే 20 నుంచి ఇప్పటివరకు లోకాయుక్త నుంచి రాష్ట్రప్రభుత్వం స్వీకరించిన అన్ని ప్రస్తావనల వివరాలను నివేదికగా ఇవ్వాలని కోరారు. గవర్నర్ లేఖతో ఉద్యోగుల్లో కలకలం మొదలయ్యిందని చెప్పవచ్చు.

రాయచూరులో దొంగల హల్‌చల్

● ముసుగు ధరించి, చాకులతో బెదిరించి నగదు, బంగారం దోపిడీ

రాయచూరు సెప్టెంబరు 15: నగరంలోని ఆశాపూర్ రోడ్డు లక్ష్మినరసింమ లేఔట్‌లో ఆదివారం వేకువ జామున దొంగలు హల్‌చల్ సృష్టించారు. ముసుగు దరించిన నలుగురు వ్యక్తులు కాలనీలో ఉంటున్న బసనగౌడ మటమారి ఇంట్లోకి చొరబడి మహిళలను, పురుషులను చాకులతో బెదిరించి ఇంట్లో ఉన్న 22 తులాల బంగారం, రూ.2 లక్షల నగదుతో పాటు కేజీకిపైగా ఉన్న వెండి సామానులను ఎత్తుకెల్లారు. అంతకు ముందే దుండగులు ఇంటి చుట్టూ ఉన్న వీధి దీపాలను ఆర్పివేసి దొంగతనానికి పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న వెస్ట్ పోలీసులు సంఘటనా స్థలాన్ని వేలిముద్ర నిపుణులు, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేసి కేసు నమోదు చేవారు. బాధితులను జిల్లా ఎస్పీ పుట్టమాదయ్య, ఇతర ఉన్నతాధికారులు బాధిత పరామర్శించారు. కాగా రెండు రోజుల క్రితమే నగరానికి చెందిన ఒక రైస్‌మిల్ యజమానిని కిడ్నాప్ చేసే ప్రయత్నం చేయగా దుండగులను వెంటనే అరెస్టు చేసిన పోలీసులు కేసు నమోదు చేశారు. అంతలోనే నగరంలో మరో సంఘటన జరగడం కలకలం రేపుతోంది. ఇంటికి వచ్చి మరీ బెదిరించడం, నగదు దోచుకెళ్లడంతో నగర వాసులు భయాందోళనకు గురవుతున్నారు. రాత్రి వేళల్లో పోలీసులు గస్తీ పెంచి, పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



హలసూరు చెరువుకు తరలుతున్న భారీ గణనాథుడు

బై..బై.. గణేశా..!

● నగరంలో ఘనంగా వినాయక నిమజ్జనం


బెంగళూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గణనాథుడికి ఘనంగా వీడ్కోలు పలికారు. వినాయక చవితి రోజున కొలువుదీర్చిన గణపతిని ఆదివారం ఊరేగింపు నిర్వహించి హలసూరు చెరువులో నిమజ్జనం చేశారు. నగరంలో 3, 5, 7, 9 రోజులకు నిమజ్జనం చేసే ఆనవాయితీ . అత్యధిక సంఘాలు కొలువుదీర్చిన భారీ గణనాథులను ఆదివారం కళాబృందాల సందడి నడుమ ఊరేగించారు. ఆర్‌టీనగర్, హెబ్బాళ చుట్టుపక్కల ప్రాంతాల్లో కొలువుదీరిన విగ్రహాలను జేపీ నగర్ నుంచి ట్యానరీ రోడ్డుమీదుగా హలసూరు చెరువుకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఊరేగింపులో హిందూ సంఘాలు, యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. బీబీఎంపీ ప్రత్యేక సిబ్బంది నిమజ్జన కార్యక్రమాన్ని పర్యవేక్షించింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు అవకాశం లేకుండా పోలీసులు బందోబస్తు పర్యవేక్షించారు.



కంటోన్మెంట్ ప్రాంతంలో ఊరేగింపుగా వెళ్తున్న గణనాథులు



ఆకట్టుకుంటున్న పంచముఖి వినాయకుడు



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1632.00	1,621.74
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	23,314	1778
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	21,358	9,924
సామర్థ్యం (టీఎంసీలు)	101.77	66.34

జూనియర్ అథ్లెటిక్స్‌లో సుదీక్షకు గోల్డ్ మెడల్



గోల్డ్ మెడల్ సాధించిన క్రీడాకారులు

బళ్లారి సిటీ, సెప్టెంబరు 15: ఈనెల 13న జరిగిన సౌత్ ఏషియన్ జూనియర్ అథెట్లిక్స్ చాంపియన్ షిప్ పోటీలో 400 మీటర్ల రిలే పరుగుపందెంలో బళ్లారికి చెందిన వడ్లూరి సుదీక్ష, నియోల్ బృందం అండర్ 20 విభాగంలో గోల్డ్ మెడల్ సాధించింది. అదేవిధంగా 11వ తేదీన బుధవారం చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన పోటీలో వడ్లూరి సుదీక్ష 100మీటర్ల పరుగుపందెంలో సిల్వర్ మెడల్ సాధించింది. ఈ దూరాన్ని 11.92 సెకండ్లలోపూర్తి చేసింది. నేషనల్ రికార్డు సాధించి కర్ణాటకకు కీర్తిని తెచ్చిపెట్టి విజయం సాధించిన ఈ బృందాన్ని రాష్ట్రప్రభుత్వం అభినందించింది.

అంబేడ్కర్‌కు ఘన నివాళులు



అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న దళిత నాయకులు

బళ్లారి సిటీ, సెప్టెంబరు 15: భారతదేశాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కారణమైన బాబా సాహెబ్ అంబేద్కర్‌కు భారతీయ బౌద్ధమహాసభ, కర్ణాటక దళిత రక్షణ వేదిక ఆదివారం ఘనంగా నివాళులర్పించాయి. ప్రజాస్వామ్య దినోత్సవంలో భాగంగా కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. బీదర్ నుండి చామరాజ్‌నగర్ వరకు 2.500 కి.మీ దూరం వరకు కుల, మతాలకు అతీతంగా ప్రజలందరూ చెయిచేయి కలిపి నిలబడ్డారు. ఇది ప్రపంచ రికార్డు అవుతుందని కాంగ్రెస్ నేత నాగలకెరె గోవింద అన్నారు. జిల్లాప్రధాన కార్యదర్శి శంకర్ నందిహాల్ మాట్లాడుతూ అంటరానితనాన్ని దూరంచేసి సోదర సమానత్వాన్ని పెంపొందించేందుకు అందరూ ఐక్యంగా ఉద్యమించాలని, రాజ్యాంగ ముసాయిదాను చదివి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యతను గుర్తుంచుకోవాలన్నారు. ఈసందర్భంగా భారతీయ బౌద్ధ మహాసభ జిల్లాధ్యక్షుడు కమలరత్న, కర్ణాటక దళిత రక్షణవేదిక కార్యనిర్వాహక అధ్యక్షుడు రాజ్‌కుమార్, శేఖరప్ప, డైరెక్టర్ భీమ్‌రావ్, కేఏఎస్ శిక్షణ కేంద్రం తరపున మల్లికార్జున, బి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వేగంగా ఎన్‌హెచ్ 63 పనులు




బళ్లారిరూరల్, సెప్టెంబరు 15 : తాలుకాలోని పరమదేవనహళ్లి గ్రామం వద్ద ఎన్‌హెచ్ 63 రోడ్డు పనులు పునఃప్రారంభం కావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా గ్యామిన్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన పనులు నిలబడి పోవడంతో వాహనదారులతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. ఈ నేపథ్యంలో గ్యామిన్ ఇండియా సంస్థ, ఎస్ఆర్‌సీ కన్‌స్ట్రక్షన్స్‌కు పనులు అప్పగించడంతో వీడీహళ్లి సమీపంలో నిలబడిన బ్రిడ్జి పనులతో పాటు రోడ్డు పనులను మళ్లీ వేగంగా చేస్తున్నారు. దీంతో గ్రామీణులు ఆనందం వ్యక్తం చేశారు.

జనజాగృత నవభారత మహోదయం

- ఘనంగా ప్రజాస్వామ్య దినోత్సవం
- బళ్లారి, విజయనగరాల్లో 85కిమీ మానవహారం
- రాయచూరులో 109కిమీ
- యువతలో పెల్లుబికిన దేశభక్తి



ప్రముఖులకు నివాళులర్పిస్తున్న ఎంపీ తుకారాం



మానవహారంలో ఎమ్మెల్యే గవియప్ప



చేయిచేయి కలిపిన విద్యార్థులు, ఉపాధ్యాయులు

బళ్లారి, విజయనగర జిల్లాల్లో ఆదివారం ప్రజలంతా చేయిచేయి కలిపి తమ ఐక్యతను, దేశభక్తిని చాటారు. అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవంలో భాగంగా ఆదివారం బీదర్ నుండి చామరాజీనగర్ వరకు 2.500 కి.మీ దూరం ప్రజలు కులమతాలకు అతీతంగా తామంతా ఒక్కటేనని నిరూపించుకున్నారు. కన్నడపతాకంతో వందలాదిమంది మానవహారంగా ఏర్పాటు కావడం అందరినీ ఆకట్టుకుంది. విజయనగరలో 40వేలమందితో 40 కిలోమీటర్లమేర మానవహారం ఏర్పాటుకాగా, బళ్లారిలో 45 కిలోమీటర్ల మేర మానవహారం నిర్మించి 2వేల మొక్కలు నాటారు. సాంఘిక సంక్షేమశాఖ పర్యవేక్షణలో 34శాఖల సమన్వయంతో నిర్మించిన ఈ మానవహారంలో విద్యార్థులు, అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొని ఆదర్శంగా నిలిచారు.

బళ్లారి సిటీ, సెప్టెంబర్ 15: భారత్‌లో బలమైన ప్రజాస్వామ్యం ఉండడం గర్వించతగ్గ విషయమని, దీంతో నవభారతం మహోన్నతంగా రూపుదిద్దుకుంటుందని ఎంపీ.తుకారాం అన్నారు. అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవంలో భాగంగా ఆదివారం సండూరు తాలూకా బన్నిహట్టి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మానవహారాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాజ్యాంగం విలువలు, ఆకాంక్షలను నిలబెట్టడానికి భారీ మానవహారం నిర్వహిస్తున్నామన్నారు. రాబోయే తరానికి మంచి భవిష్యత్తును నిర్మించేందుకు ఇది దోహదపడుతుందన్నారు. ఈ సందర్భంగా రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ కృషితో బృహత్తర రాజ్యాంగాన్ని తెచ్చుకున్నామన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో దేశాన్ని నడిపిస్తూ 1950 జనవరి 26 నుంచి గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. సురక్షితమైన దేశాన్ని నిర్మించడానికి ఆలోచనలు, ప్రణాళికలను సమీక్షించ... కోవాల... న్నారు. ... పౌరులు దేశభక్తిని పెంచుకుని సమ సమాజ నిర్మాణానికి పాటుపడాలన్నారు.

బాబూ జగ్జీవన్‌రామ్ లెదర్ ఇండస్ట్రీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవాన్ని అపూర్వంగా నిర్వహించిందని, ఐక్యత, సమానత్వం అనే సారాంశాన్ని చాటేందుకు భారీ మానవ హారం నిర్వహించామన్నారు. భారతదేశం రాజ్యాంగపరంగా పటిష్టంగా, సురక్షితమైనదని, ప్రజాస్వామ్యంపై నమ్మకంతో అభివృద్ధి పథంలో పయనిస్తామన్నారు. బళ్లారి ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీసు లోకేశ్ మాట్లాడుతూ భారతదేశం చాలా కఠినమైన రాజ్యాంగాన్ని కలిగిఉంద న్నారు. 32వేల మంది విద్యార్థులు వివిధ విభాగాల సహకారంతో 45కిలోమీటర్ల మేర మావనహారం నిర్మించి 2వేల మొక్కలు నాటినట్లు తెలిపారు. ఇదే సమయంలో రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్, జాతిపిత మహాత్మగాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా జిల్లాకలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, ఏడీసీ మహ్మద్‌జుబేరా, జిల్లాపంచాయితీ సీఈఓ రాహుల్‌శరణప్ప, జిల్లా పోలీసు అధికారి శోభరాణి, జిల్లాస్థాయి అధికారులు, తాలూకా స్థాయి అధికారులు, ఎన్జీఓ ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విజయనగరంలో ఘనంగా ప్రజాస్వామ్య దినోత్సవం

అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవాన్ని విజయనగరం జిల్లాలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో 40వేలకు పైగా మానవహారం నిర్వహించి స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వ సందేశాన్ని ప్రభోదించారు. బీదర్ నుంచి చామరాజనగర్ వరకు 2,500 కి.మీ మేర మానవహారం నిర్మించి ప్రపంచ రికార్డు నెలకొల్పాలన్న ప్రచార కార్యక్రమంలో జిల్లాప్రజలు సైతం ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కొప్పళ జిల్లా సరిహద్దు మునీరాబాద్ తుంగభద్ర వంతెన నుంచి ప్రారంభమైన మానవ హారం బళ్లారి జిల్లా సరిహద్దు భువనహళ్ళి వరకు సాగింది. నగరంలోని అంబేద్కర్ సర్కిల్లో నిర్మించిన వేదిక వద్ద ఎమ్మెల్యే గవియప్ప అధ్యక్షతన సభా కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో కలెక్టర్ దివాకర్, ఎస్పీ శ్రీహరిబాబు, డెవలప్ మెంట్ అథారిటీ మహ్మద్ ఇమామ్ నియాజీ, మాతా మంజమ్మజోగతి, మంజునాథ్, వివిధసంఘ సంస్థలు, ప్రజానాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



గూగల్ గ్రామంలో ఏర్పాటైన మానవహారంలో ప్రముఖులు

రాయచూరులో 109కిమీ ప్రజాహారం

రాయచూరు సెప్టెంబర్ 15 : ప్రపంచ ప్రజాప్రభుత్వ దినోత్సవం సందర్భంగా ఆదివారం జిల్లాలో దాదాపు 109కిమీ దూరం మేర మానవహారాన్ని ఏర్పాటు చేవారు. దేవదుర్గ తాలూకా గూగల్ గ్రామంలోని అల్లమప్రభు దేవస్థానంలో ఆదివారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో అదనపు జిల్లాధికారి జగదీశ్ సంపగాణి మానవహారాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, యువకులు వివిధ వర్గాల ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు అక్కడి నుంచి జిల్లా సరిహద్దు వరకు మానవహారం ఏర్పాటు చేసి ప్రజాప్రభుత్వ దినోత్సవాన్ని విజయవంతం చేశారు.

రూ.54వేలు పలికిన వినాయకుని లడ్డూ

కంప్లి, సెప్టెంబరు 15 : కుడితిని పట్టణం రాఘవేంద్ర కాలనీలోని శ్రీ రాఘవేంద్ర గ్రామీణాభివృద్ధి సంస్థ వినాయక మండలి ఆధ్వర్యంలో ఆదివారం వినాయకుని లడ్డు, హుండీలను వేలం వేశారు. అందులో వినాయకుని లడ్డు ప్రసాదాన్ని రూ.54 వేలకు సురేంద్ర ప్రసాద్ దక్కించుకున్నారు. హుండీని రూ. 27,600లకు దక్కించుకున్నారు. కలశాన్ని శేషుబాబు రూ. 25 వేలకు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రముఖులు మాట్లాడుతూ ప్రతి యేడాది వినాయక చవితిని పురస్కరించుకుని రాఘవేంద్ర కాలనీలో వినాయక చవితి వేడుకలను జరుపుకుంటామన్నారు. చివరకు వినాయక నిమజ్జనం అనంతరం అక్కడ తొమ్మిది రోజులు వుంచిన వినాయకుని లడ్డును వేలం వేస్తామని ఈ యేడాది లడ్డు సురేంద్ర ప్రసాద్, హుండీని సురేష్, కలశాన్ని శేషుబాబు దక్కించుకున్నారన్నారు. వారితో పాటు రాఘవేంద్ర గ్రామీణాభివృద్ధి సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



వేలంలో లడ్డు, కలశం దక్కించుకున్నవారిని సన్మానిస్తున్న దృశ్యం

సంగనకల్లు వృద్ధాశ్రమంలో నాగేంద్ర జన్మదిన వేడుకలు



వృద్ధులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ముండ్రగి నాగరాజు, యతీంద్రగౌడ్



కనకదుర్గమ్మ ఆలయం వద్ద పూజల కోసం వచ్చిన నాగేంద్ర అభిమానులు

బళ్లారి సిటీ, సెప్టెంబరు 15: మాజీ మంత్రి, బళ్లారి రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బి.నాగేంద్ర 53వ జన్మదినాన్ని ఆదివారం తాలూకాలోని సంగనకల్లు గ్రామంలోని ఆదర్శ వృద్ధాశ్రమంలో ఎల్ఐడీకార్ అధ్యక్షుడు ముండ్రగి నాగరాజు, నాగేంద్ర అభిమానుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంలో వృద్ధులకు దుస్తులు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లిడ్కర్ అధ్యక్షులు ముండ్రగి నాగరాజు మాట్లాడుతూ నిరుపేదలపట్ల కనికరం ఉన్న నాగేంద్ర ప్రజల మధ్యపెరిగాడని, ఆయనపైవచ్చిన ఆరోపణలు సత్యదూరమన్నారు. కాంగ్రెస్ జిల్లాధ్యక్షుడు యతీంద్రగౌడ్ మాట్లాడుతూ, నాగేంద్ర జన్మదిన వేడుకలను పెద్దలతో కలిసి జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. సత్యపరీక్షలో నాగేంద్ర గెలుపు ఖాయమన్నారు. ఈసందర్భంగా సంగనకల్లు విజయకుమార్, విశ్రాంత ఆచార్య శ్రీనివాస్ మూర్తి, డీఎస్ఎస్ జిల్లా పాలనాధికారి గోవర్ధన్, జోగిన విజయ్‌కుమార్, గ్రామపంచాయితీ సభ్యులు నాగరెడ్డి, దివాకర్ బాబు, కాంగ్రెస్‌పార్టీ నాయకులు పార్వతయ్య, కృష్ణ, చిన్నభీమప్ప, చంద్రప్ప, జాడప్ప.నాగరాజు, అంజి, శివరాం తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

బళ్లారి రూరల్, సెప్టెంబరు 15 :మాజీ మంత్రి గ్రామీణ ఎమ్మెల్యే నాగేంద్ర (53)వ జన్మదినం సందర్భంగా బళ్లారి కనకదుర్గమ్మ ఆలయంలో నాగేంద్ర అభిమానుల ఆధ్వర్యంలో విశేష పూజలు జరిగాయి. అనంతరం ఎస్పీ సర్కిల్, రాయల్ సర్కిల్, మూర్తి సర్కిల్‌లో ఏర్పాటు చేసిన కటౌట్‌లకు పాలాభిషేకం నిర్వహించారు. అనాథా శ్రమాలలో వృద్ధులకు వస్త్రాలు పంపిణీచేసి సంబరాలు జరుపుకున్నారు. ఎమ్మెల్యే నాగేంద్ర అభిమానులు గ్రామీణ ప్రజలు జోళదరాసి కుంటి మారెమ్మ దేవస్థానం సమీపంలో కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకుని కేక్‌లు కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ముండ్రిగి నాగరాజు, సంగనకల్లు విజయ్ కుమార్, మీనళ్లి వెంకటేష్, తలమామిడి రాజు, మేయర్ ముల్లంగి నందీష్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు అల్లం ప్రశాంత్, భైరదేవనహళ్లి, సత్యనారాయణరెడ్డి, ఎల్పీ పంపనగౌడ పాల్గొన్నారు.

నైరుతి రైల్వే సమితి కమిటీ సభ్యుడిగా గోపాలకృష్ణ



బళ్లారిరూరల్, సెప్టెంబరు 15 : బళ్లారిరూరల్ రైల్వే వినియోగదారుల సలహా కమిటీ సభ్యుడిగా బళ్లారికి చెందిన ఆర్ గోపాలకృష్ణ నియమితులయ్యారు. రెండేళ్ల పాటు ఆయన నియామకం అమలులో వుంటుందని రైల్వే ఉన్నతాధికారులు తెలిపారు. ఆయన నియామకం పట్ల పలువురు నాయకులు, బళ్లారి వాణిజ్య సంఘం సభ్యులతో పాటు నాయకులు, పలు సంఘాల సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణ మాట్లాడుతూ మన ప్రధాని నరేంద్ర మోడీ హయాంలో దేశంలో రైల్వే వ్యవస్థ బాగా అభివృద్ధి చెందుతుందని దీని ద్వారా వినియోగదారులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు మన కృషిచేస్తామని తెలిపారు.

గ్రామాల్లో జోరుగా జోకుమార పూజలు

కంప్లి, సెప్టెంబరు 15 :గ్రామాల్లో వినాయక నిమజ్జనం పూర్తవుతుండటంతో అలాగే పౌర్ణమి వస్తుండటంతో గ్రామాల్లో గంగామత సమాజానికి చెందిన మహిళలు ఇంటింటా జానపద గీతాలు పాడుతూ జోకుమారుడికి పూజలు చేపడుతున్నారు. కంప్లి పరిధిలోని నెల్లూరు, జవుకు, జానూరు, దేవసముద్రం, మెట్రి, దేవలాపురం గ్రామాలలో జోకుమారుడికి ఇంటింటాపూజలు చేపడుతున్నారు. మహిళలుధాన్యం, నూనె, పప్పు గింజలు తదితర వాటితో జోకుమారుడికి మొక్కులు తీర్చు కుంటున్నారు. మహిళలు ఈ కార్యక్రమంలో దరోజీకు చెందిన ఉలిగమ్మ,చంద్రమ్మ, ఈరమ్మ, నాగమ్మ, నింగమ్మ, జడెప్ప, శారద తదితరులు పాల్గొన్నారు.

కురేకుప్ప పట్టణంలో కట్టడ కార్మికుల సంఘం ఏర్పాటు



కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ, తదితర ప్రముఖులు

తోరణగల్లు, సెప్టెంబరు 15 : కురేకుప్ప పట్టణంలో కర్ణాటక రాష్ట్ర కట్టడ కార్మికులు, ఇతర నిర్మాణ కార్మికులు నూతనంగా సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు.. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సత్యబాబు, సీఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్న బసయ్యస్వామి, దేవన్న మొదలగు వారు మాట్లాడుతూ, శిక్షణతో పాటు ఇతర సౌలభ్యాలు నిజమైన కార్మికులకు అందడం లేదని, బోగస్ కార్డుల ఏరివేత నెపంతో నిజమైన కార్మికులకు అన్యాయం జరుగుతుందన్నారు. అధికారులు అనవసరమైన కిట్లను ఖరీదు చేస్తున్నారని రెండేళ్ల నుండి కార్డుల నవీకరణ జరగడం లేదని కొత్త కార్డులు కార్మికులకు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. అలాగే నూతనంగా తన సంఘం అధ్యక్షులుగా కే సత్యన్న, కార్యదర్శిగా హాలేష, ఉపాధ్యక్షులుగా నరసింగప్ప, కరెన్సీ అంబరీష్ తదితరులు ఎన్నుకోబడ్డారు. ఈ సందర్భంగా పురసభ అధ్యక్షులు కల్లుడప్ప, ప్రముఖులు దొడ్డ బసప్ప, దరోజీ, తోరణ సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

పండుగల సందర్భంగా భారీపోలీసు బందోబస్తు

సిరుగుప్ప, సెప్టెంబరు 15 : ఈద్ మిలాద్, విశ్వహిందూ గణపతి నిమజ్జనం కోసం జిల్లా ఎస్పీ శోభారాణి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సోమవారం ఈద్ మిలాద్, మంగళవారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో గణేశ నిమజ్జనం జరుగనుంది. ఈ సందర్భంగా పట్టణానికి వెయ్యి మందికి పైగా పోలీసులు, హోమ్‌గార్డులు తరలివచ్చారు.బళ్లారి, విజయనగరం, కొప్పాళ, రాయచూరు జిల్లాలకు చెందిన పోలీసులు పాల్గొన్నారు.

ఇరు వర్గాల ఘర్షణలో వ్యక్తి మృతి

రాయచూరు సెప్టెంబర్ 15 : పాతకక్షల కారణంగా రాయచూరు తాలూకాలోని మిర్జాపూర్ గ్రామంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకోగా ఒక వ్యక్తి మృత్యువాత పడ్డాడు. గ్రామంలోని దుళ్ళయ్య, గోవిందు వర్గాల మధ్య శనివారం దహన సంస్కార కార్యక్రమం సందర్భంగా వాగ్వాదం చోటు చేసుకొంది. రాత్రి ఇరు వర్గాలు దాడికి దిగారు. ఈ ఘర్షణలో భీమేశ్ నాయక్(38) అనే వ్యక్తి మృత్యువాతపడగా రాములమ్మ అనే మహిళకు తీవ్ర గాయాలైయ్యాయి. ఆమెతో పాటు మరో ఏడుగురికి తీవ్ర గాయాలు కాగా గాయపడిన వారిని జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు.



గంగ ఒడికి గౌరీ తనయుడు

హోసూరు జోన్

హోసూరు, సెప్టెంబరు 15: కృష్ణగిరి జిల్లాలో వినాయక నిమజ్జనం కార్యక్రమం కన్నులపండువగా సాగింది. కలెక్టర్ సూచన మేరకు ఆదివారం వివిధ సంఘాల వారు సామూహికంగా వినాయక ఊరేగింపు జరిపారు. జిల్లావ్యాప్తంగా ప్రత్యేకించి హోసూరులో భారీ బందోబస్తు నిర్వహించారు. వినాయక చవితి రోజున కొలువుదీర్చిన భారీ గణనాథులకు 9రోజుల పాటు విశేషపూజలు చేసిన అనంతరం ఆదివారం అన్నదానం నిర్వహించారు. హిందూ సంఘాల ఆధ్వర్యంలో నగరవ్యాప్తంగా వేర్వేరు ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన 84 భారీ విగ్రహాలను ఆదివారం ఘనంగా ఊరేగించారు. వినాయక ప్రతిమలన్నింటినీ చెరువులలో సంప్రదాయంగా నిమజ్జనం చేశారు. రామనాయకన చెరువు, బూదినాయకన చెరువు, దర్గా చెరువు, కెలవరపల్లి డ్యామ్ తదితర నిర్దేశించిన ప్రదేశాలలో నిమజ్జనం చేశారు. డిఐజి ఉమా నేతృత్వంలో 1800 మంది పోలీసులు బందోబస్తులో పాల్గొన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా బ్యారికేడ్‌లు ఏర్పాటు చేశారు. వాహనాల ఊరేగింపు క్రమబద్ధంగా సాగేలా పర్యవేక్షించారు. ఊరేగింపును వీక్షించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. హోసూరు చుట్టుపక్కల ప్రాంతాలలో కూడా వినాయక నిమజ్జనంలో యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్థానిక పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేశారు.



నగరంలో వినాయకుల ఊరేగింపు ఇలా..



కాషాయజెండాలతో ధార్మిక ప్రదర్శన

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కుంచె...

ఎంఎస్ సుబ్బులక్ష్మి (జయంతి)



భారతరత్న పురస్కారం అందుకున్న తొలి భారతీయ కళాకారిణి, ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసురాలు మధురై షణ్ముఖవడివు (ఎంఎస్) సుబ్బులక్ష్మి 1916 సెప్టెంబరు 16న తమిళనాడు రాష్ట్రం మధురైలో జన్మించారు. సెమ్మంగుడి శ్రీనివాస అయ్యర్ వద్ద సంగీతంలో శిక్షణ పొంది తన ప్రతిభకు స్పష్టమైన రూపు ఇచ్చారు. 1974లో రామన్ మెగసెసె పురస్కారం పొందారు. ఆధ్యాత్మిక గానంలో ఆమె శైలి విశిష్టమైనది. ప్రత్యేకించి భజన గీతాలకు ప్రాణం పోశారు. సంగీత కళానిధి, పద్మభూషణ్, పద్మ విభూషణ్, కాళిదాస్ సమ్మాన్, ఇందిరాగాంధీ జాతీయ సమైక్యతా అవార్డు, పలు గౌరవ డాక్టరేట్‌లు అందుకున్నారు. 2004 డిసెంబరు 11న పరమపదించారు.

పీ చిదంబరం (పుట్టినరోజు)



దేశ ప్రముఖ రాజకీయ నాయకుల్లో ఒకరైన పళనియప్పన్ చిదంబరం 1945 సెప్టెంబరు 16న జన్మించారు. ప్రస్తుతం రాజ్యసభ సభ్యుడిగా ఉన్నారు. కేంద్ర ఆర్థికశాఖ మంత్రిగా నాలుగుసార్లు వ్యవహరించారు. అంతేకాక ఇంటెరిమ్ డిప్యూటీ లీడర్ ఆఫ్ అపోజిషన్‌గా 2022 నుంచి 2023 వరకు వ్యవహరించారు. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఆన్ హోమ్ అఫైర్స్‌కు చైర్మన్‌గా కొనసాగారు. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదిగా, హైకోర్టులలోనూ సీనియర్ న్యాయవాదిగా వ్యవహరించారు. పలు రకాల అంశాలపై పత్రికల్లో వ్యాసాలు రాశారు. పుస్తకాలు కూడా రాశారు.

ప్రసూన్ జోషి (పుట్టినరోజు)



'పద్మశ్రీ' పురస్కార గ్రహీత ప్రసూన్ జోషి 1971 సెప్టెంబరు 16న ఉత్తరాఖండ్ రాష్ట్రం అల్మోరా ప్రాంతంలో జన్మించారు. స్క్రీన్ రైటర్‌గా, లిరిసిస్ట్‌గా, కవిగానే కాక మార్కెటింగ్‌లోనూ సత్తా చాటుకున్నారు. ఎంసీ కెన్ వరల్డ్ గ్రూప్ సీఈఓగా, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్‌కు చైర్‌పర్సన్‌గా వ్యవహరించారు. మూడుసార్లు ఉత్తమ గేయ రచయిత్రిగా ఫిల్మ్‌ఫేర్, రెండు సార్లు నేషనల్ ఫిల్మ్ అవార్డ్ ఫర్ బెస్ట్ లిరిక్స్ అందుకున్నారు.

ఆట అదుర్స్..!

● అభిమానులతో కిటకిటలాడిన ఏసీజీ



డ్రమ్స్ మోత

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 15: ఊహించినట్లుగా ఇండియా-ఏ జట్టు భారీ విజయం సాధించింది. ఇండియా-బి, ఇండియా- సి జట్ల మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. స్థానిక అనంతపూర్ క్రికెట్ గ్రౌండ్‌లో రెండో రౌండ్ దులీప్‌ట్రోఫీ క్రికెట్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఓవర్‌నైట్ స్కోర్ 62/1తో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇండియా-డి లక్ష్య ఛేదనలో విఫలమైంది. తెలుగుతేజం రిక్కీ భుయ్ వీరోచిత (113) సెంచరీతో ఆకట్టుకున్నా తన జట్టును గెలుపు తీరాలకు చేర్చలేకపోయాడు. చివరి రోజు 426పరుగులు సాధించాల్సి ఉండగా ఇండియా-డి 82.2ఓవర్లలో 301పరుగులకు ఆలౌట్ అయ్యింది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ 41, యశ్ దుబే 37, సంజు శ్యాంసన్ 40 ఫరవాలేద నిపించగా మిగతా బ్యాటర్లు విఫలమవడంతో పరాజయం తప్పలేదు. దీంతో ఇండియా ఏ జట్టు 186పరుగుల తేడాతో విజయం సాధించింది. ఇండియా ఏ బౌలర్లు తనుష్ కోటియాన్ 4వికెట్లు, షాంశ్‌ములానీ 3, ఖలీల్‌అహ్మద్, రియాన్ పరాగ్‌లో చెరో వికెట్ పడగొట్టారు. ఇండియా ఆల్ రౌండర్ షాంశ్‌ములానీ ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్‌గా నిలిచాడు. ఇండియా- ఏ జట్టులో తిలక్‌వర్మ, ప్రథమ్ సింగ్ సెంచరీలు సాధించారు. ఇండియా-డి జట్టులో రిక్కీభూయ్ సెంచరీ సాధించాడు.

డ్రాగా ముగిసిన మ్యాచ్

దులీప్‌ట్రోఫీలో భాగంగా ఇండియా-బి, ఇండియా- సి జట్ల మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. నాలుగు రోజుల మ్యాచ్‌లో ఇండియా- సి మొదటి ఇన్నింగ్స్‌లో 525 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఇండియా- బి మొదటి ఇన్నింగ్స్‌లో 332 పరుగులకు ఆలౌట్ అయ్యింది. రెండో ఇన్నింగ్స్ ఆ రంభించిన ఇండియా-సి జట్టు చివరి రోజు 37ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 124 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. జట్టులో కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ 62, రజిత్ పటిదార్ 42 రాణించారు. రాహుల్ చాహర్ 2, ముకేష్‌కుమార్, ముషీర్‌ఖాన్‌లు చెరో వికెట్ పడగొట్టారు. ఈ మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో ఇండియా- సి బ్యాటర్ ఇషాన్ కిషాన్, ఇండియా- బి కెప్టెన్ అభిమన్యు ఈశ్వరన్ శతాకాలతో మెరిశారు. చివరి రోజు కావడం, ఫలితం తేలే అవకాశం లేకపోవడంతో ఇండియా- బి రెండో ఇన్నింగ్స్ ఆరంభించకనే అంపైర్లు మ్యాచ్‌ను డ్రాగా ప్రకటించారు. ఆల్‌రౌండర్ అన్షుల్‌కాంబోజ్ ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్‌గా నిలిచారు.

ఉమ్మడి జిల్లాలో క్రికెట్ స్టేడియం

ఉమ్మడి జిల్లాలో స్టేడియం నిర్మించి, ఆంధ్రాక్రికెట్ అకాడమీ ఏర్పాటు చేస్తామని ఏపీఏ మౌలిక వసతుల కల్పన కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్ తెలిపారు. దులీప్ ట్రోఫీని రాయలసీమ ప్రాంతంలోని అనంతపురం నిర్వహించడం శుభపరిణామమన్నారు. రాయలసీమ క్రీడాకారులు భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించేలా తీర్చిదిద్దుతామన్నారు.

కిటకిటలాడిన స్టేడియం

తొలిమ్యాచ్ మాదిరి మూడు రోజులకే ముగియకుండా నాలుగు రోజుల పాటు ఆట కొనసాగడం, చివరి రోజు ఆదివారం కావడంతో ఆర్డీటీ స్టేడియం ప్రేక్షకులతో కిటకిటలాడింది. పాఠశాల, కళాశాలల విద్యార్థులు ఆటను ప్రత్యక్షంగా చూసేందుకు స్టేడియానికి తరలివచ్చారు. ఈలలు, కే రింతలతో ఆటగాళ్లను ప్రోత్సహించా రు. నగర ప్రజలు, జిల్లాలోని క్రీడాభిమానులు స్టేడియానికి తరలి వచ్చి ఆనందించారు. కార్యక్రమంలో ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాం చోఫెర్రర్, బీసీసీఐ మేనేజర్ అమిత్ సిద్దేశ్వర్, ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్, జిల్లా క్రికెట్ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

నగరంలో ఉత్సాహంగా గణేశ్ నిమజ్జనం



శివాజీనగర్ నుంచి ఊరేగింపు ఇలా...

బెంగళూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నగరం లోని కంటోన్మెంట్ ప్రాంతానికి అనుబంధమైన గణేశ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో 251 భారీ వినాయకులను సామూహిక ఊరేగింపు నిర్వహించారు. పంచముఖి వినాయకుడు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తిమ్మయ్య రోడ్డుమీదుగా ఊరేగింపు సాగింది. కళా బృందాలు, బాణసంచా నడుమ ఉత్సాహంగా ప్రజలు పాల్గొన్నారు. మూషిక వాహనధారుడు, సింహవాహన ధారుడు, ఇతర ఆకృతులలో వినాయకుడిని ట్రాక్టర్‌లపై ఊరేగించారు. హలసూరు చెరువులో నిమజ్జనం నిర్వహిం చారు. ఊరేగింపు నేపథ్యంలో ట్రాఫిక్‌ను మళ్లించారు. పెద్దసంఖ్యలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. యువత పెద్దసంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఊరేగింపును వీక్షించేందుకు ప్రజలు తరలివచ్చారు. చెరువు వద్ద కూడా తగిన జాగ్రత్తలు పాటించారు.



ఊరేగింపులో భక్తుల సందడి...



సింహవాహనధారుడు తదితర రకాల గణనాథులు



కాషాయజెండాల నడుమ ఊరేగింపు ఇలా...



తరలుతున్న గణనాథులు

పాఠశాలల ప్రగతికి పరిశ్రమల సహకారం

›› ఎమ్మెల్యే రవికుమార్

శిడ్లఘట్ట, సెప్టెంబరు 15: తాలూకాలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి పరిశ్రమల సీఎస్ఆర్ నిధుల సహకారం ఇచ్చేలా చేస్తామని కేంద్రమంత్రి కుమారస్వామి భరోసా ఇచ్చారని ఎమ్మెల్యే రవికుమార్ వెల్లడించారు. తాలూకాలోని 78 గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ భవనాల నిర్మాణం అవసరం ఉందని బీఈఓ ప్రత్యేకంగా జాబితా ఇచ్చారని దీనిపై కేంద్రమంత్రి కుమారస్వామితో చర్చలు జరపగా సానుకూలంగా స్పందించారన్నారు. వచ్చే బడ్జెట్ అనంతరం పరిశ్రమల సీఎస్ఆర్ నిధులు వచ్చేలా చేస్తామని హామీ ఇచ్చారన్నారు. పట్టణ శివారులోని బాలాజి కల్యాణమండపంలో ఏర్పాటైన ఉపాధ్యాయ దినోత్సవంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మన తాలూకా పిల్లలు చక్కగా చదివేలా ఉపాధ్యాయులు మరింత చొరవ చూపాలన్నారు. ఉపాధ్యాయుల మార్గదర్శకంలో పిల్లలు చక్కటి పౌరులుగా ఉంటారని అభిప్రాయపడ్డారు. పిల్లల్లో ఆత్మస్థైర్యం పెంచాలన్నారు. విద్యారంగంలో శిడ్లఘట్ట తాలూకాకు మంచి పేరు తేవాలని ఉపాధ్యాయులను కోరారు. ఎంపీ మల్లేశ్‌బాబు మాట్లాడుతూ ఉపాధ్యాయులు నిరంతర అభ్యాసం, అధ్యయనం చేయాల్సి ఉంటుందన్నారు. తహసీల్దార్ బీఎన్ స్వామి మాట్లాడుతూ ఉత్తమ ఉపాధ్యాయుల వల్ల నైతిక విలువలతో కూడిన విద్య సాధ్యమన్నారు. విజయపుర సాయి జ్ఞానగంగా ఫస్ట్‌గ్రేడ్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసమూర్తి ప్రత్యేక ప్రసంగంలో ఉపాధ్యాయుల పాత్రను వివరించారు. ఈ సంవత్సరం రిటైరైన ప్రాథమిక, హైస్కూల్ ఉపాధ్యాయులను సత్కరించారు. ఇదే సందర్భంగా క్రీడలు, సాంస్కృతిక పోటీల విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. తాలూకా పంచాయతీ ఈఓ హేమావతి, బీఈఓ నరేంద్రకుమార్, జిల్లా విద్యా సాక్షరతా డిప్యూటీ డైరెక్టర్ బైలాంజినప్ప, డయట్ ప్రిన్సిపాల్ మునికెంపేగౌడ, బంకు మునియప్ప తాలూకా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు నారాయణస్వామి, నగరసభ అధ్యక్షుడు వెంకటస్వామి, ఉపాధ్యక్షురాలు రూపనవీన్ తదితరులు పాల్గొన్నారు.



రిటైరైన ఉపాధ్యాయులకు సన్మానంలో ఎమ్మెల్యే రవికుమార్ తదితరులు

ఓరల్ సర్జన్స్ అసోసియేషన్ కార్యదర్శిగా డాక్టర్ గిరీశ్‌గౌడ



డాక్టర్ గిరీశ్‌గౌడ

బెంగళూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నగరం లోని సంజయ్‌గాంధీ ఆసుపత్రిలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా వ్యవహరిస్తున్న డాక్టర్ గిరీశ్‌గౌడ ఓరల్ అండ్ మాక్సిలోఫేసియల్ సర్జన్స్ రాష్ట్ర అసోసియేషన్ కార్యదర్శిగా నియమితులయ్యారు. బళ్ళారిలో సంఘం 11వ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్‌లసంఘం సమావేశంలో గిరీశ్‌గౌడ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మైసూరుకు చెందిన డాక్టర్ గిరీశ్‌గౌడ ఓరల్ అండ్ మాక్సిలో ఫేసియల్ సర్జరీలో తనదైన గుర్తింపు పొందారు. క్లిష్టమైన దవడ శస్త్ర చికిత్సలను విజయవంతం చేసిన ఘనత ఉంది. ఎప్పటికప్పుడు ఈ రంగంలో ఆధునాతన విధానాలను పాటిస్తూ డాక్టర్‌గా రాణించి రాష్ట్రస్థాయి సంఘం సర్జన్‌ల సంఘానికి కార్యదర్శి అయ్యారు.

పలు రంగాల్లో విజేతలకు సన్మానం



సాధకులకు సన్మానంలో సంస్థ ప్రముఖులు

దొమ్మసంద్ర, సెప్టెంబరు 15: ఆనేకల్ తాలూకా ఐఎస్‌బీఆర్ కాలేజ్‌లో ఉపాధ్యాయ దినోత్సవం, ఫౌండర్స్‌డేలో భాగంగా వివిధ రంగాల సాధకులను ఆత్మీయంగా సత్కరించారు. విద్య, క్రీడలు, సాహిత్యం, సమాజ సేవ, పరిశ్రమ తదితర రంగాలలో రాణించినవారిని సన్మానించారు. హైకోర్టు రిటైర్డు న్యాయమూర్తి జస్టిస్ కుమార్, విద్యానిపుణుడు డాక్టర్ రిషికేశ్ టి కృష్ణ, డాక్టర్ దేబబ్రతదాస్, పర్యావరణ రంగంలో రేవతి కామత్, మహిళా స్వావలంబనలో రజితా కులకర్ణి, పరిశ్రమ రంగంలో వైద్యనాథన్, శ్రీకాంత్ వాచస్పతి, కార్తిక్ శ్రీనివాసన్, ఉషా ఇలా 20మందికిపైగా సాధకులను సత్కరించారు. ఐఐఎం బెంగళూరు డైరెక్టర్ డాక్టర్ రిషికేశ్ టి కృష్ణన్ మాట్లాడుతూ నాయకత్వ లక్షణాలు పెంచే బాధ్యత విద్యాసంస్థలపై ఉందన్నారు. అలాగే విద్యార్థులు కూడా కేవలం పాఠాలకే పరిమితం కాకుండా పాఠ్యేతర అంశాలపై క్రీడలు, సాంస్కృతిక రంగాలలో తమ అభిరుచికి తగినట్టుగా రాణించి సత్తా చాటుకోవాలన్నారు. సన్మానాలు, ప్రశంసలు అనేవి బాధ్యతను పెంచుతాయన్నారు. అలాగే సమాజానికి దోహద పడే పరిశోధనలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. రేవతికామత్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలను సందర్శించడం ద్వారా స్థానిక సమస్యలపై అవగాహన పెంచుకుని పరిష్కార మార్గాలను సూచించాలన్నారు. పర్యావరణానికి తమ వంతు సహకారం అందించి ప్రజలను చైతన్య పరచాలని విద్యార్థులకు సూచించారు. ఐఎస్‌బీఆర్ సంస్థ అధ్యక్షుడు మనీశ్ కొఠారి, సంస్థకు చెందిన ప్రకాశ్, డాక్టర్ కేఎస్ ఆనందరామ్, సి మనోహర్, నరసింహన్, నీలా, లక్ష్మీనారాయణ్, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

23 వరకు ఈ-పంట నమోదు గడువు



అనంతపురం అర్బన్, సెప్టెంబరు 15: ఈ ఏడాది ఖరీఫ్ ఈ-పంట నమోదు గడువును ఈనెల 23వతేదీ వరకు పొడిగించారు. ఈ మేరకు వ్యవసాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇదివరకు ఆదివారం వరకే గడువు విధించారు. ఈనెల 23వతేదీలోపు ఈ-పంట నమోదుతోపాటు రైతుల ఈకేవైసీ పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈనెల 25 నుంచి 27వతేదీ వరకు రైతు సేవా కేంద్రాల్లో ఈ-పంట వివరాలు ప్రదర్శించడంతోపాటు గ్రామ సభలు నిర్వహించి, సోషల్ ఆడిట్ నిర్వహించాలని నిర్ణయించారు. 28 నుంచి 29వతేదీ వరకు రైతులతో అర్జీలు స్వీకరిస్తారు. ఈనెల 30న తుది జాబితాను ప్రదర్శిచనున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది ఖరీఫ్‌లో 8.88 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేశారు. ఇప్పటి దాకా 8.88 లక్షల ఎకరాల్లోనూ (100 శాతం) ఈ పంట నమోదు చేశారు. ఈ-పంట నమోదు వివరాలు సర్వర్‌కు అప్‌లోడ్ చేసిన తర్వాత వీఏఏ అథంటికేషన్ చేస్తారు. ఆ తర్వాత వీఆర్వో అంథంటికేషన్ చేయాల్సి ఉంటుంది. ఇప్పటి దాకా రైతు సేవా కేంద్రం సిబ్బంది 8.62 లక్షల ఎకరాలకు అంథంటికేషన్ చేశారు. ఇందులో 8.37 లక్షల ఎకరాలకు వీఆర్వోలు అంథంటికేషన్ పూర్తయింది. రైతు సేవా కేంద్రం సిబ్బంది, వీఆర్వో అథంటికేషన్ తర్వాత రైతుతో ఈకేవైసీ చేయిస్తేనే ఈ-పంట పూర్తవుతుంది. ఇప్పటిదాకా 3.30 లక్షల మంది రైతులతో ఈకేవైసీ వేయించారు. గడువులోగా రైతులతో ఈకేవైసీని పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశించారు.

పిల్లలకు సంస్కారం నేర్పాలి

బంగారపేట, సెప్టెంబరు 15: పిల్లలను కేవలం పాఠాలకే పరిమితం చేయకుండా మన సంస్కృతి సంప్రదాయాలు, నైతిక విలువలు, సంస్కారం వంటివి నేర్పాలని పల్లవిమణి అభిప్రాయపడ్డారు. తాలూకాలోని కారహళ్ళి గ్రామపంచాయతీ పరిధిలోని యలబుర్గి గ్రామం వెంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో ఆదివారం సామూహిక వరలక్ష్మీపూజ, ధార్మిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లవిమణి మాట్లాడుతూ పిల్లల్లో సంస్కారం నేర్పడంలో మహిళల పాత్ర కీలకమన్నారు. నేటితరం పిల్లల్లో ధార్మిక ఆసక్తి తక్కువగా ఉందన్నారు. మొబైల్, ఇతరత్రా అంశాల పట్ల మక్కువ చూపుతుండడం విచారకరమన్నారు. గ్రామాలలో వెనుకబడిన కుటుంబం ప్రగతికి, గ్రామాభివృద్ధికి ధర్మస్థళ ధర్మాధికారి డాక్టర్ వీరేంద్రహెగ్డే అందిస్తున్న సేవలను కొనియాడారు. జిల్లా జనజాగృతి వేదికకు చెందిన చంద్రశేఖర్ మాట్లాడుతూ నిస్వార్థ సేవతోనే వ్యక్తి పరిపూర్ణుడు అవుతారన్నారు. సమాజసేవలో వీరేంద్రహెగ్డే దేశానికి ఆదర్శంగా ఉన్నారన్నారు. బాలబాలికలకు సైతం మన సంస్కృతిని నేర్పాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఇందుకు తల్లిదండ్రులు ఇద్దరూ చొరవ చూపాలన్నారు. గౌరవ సలహాదారుడు అంజప్ప మాట్లాడుతూ భజనలు, ఇతర ధార్మిక కార్యక్రమాల్లో పిల్లలను సైతం భాగస్వాములను చేయడం ద్వారా వారిలో ధార్మిక ఆసక్తి పెరుగుతుందన్నారు. వరమహాలక్ష్మి పూజా సమితి అధ్యక్షుడు మంజునాథ్, చిన్ని వెంకటేశ్, ధర్మస్థళ గ్రామాభివృద్ధి యోజనాధికారి చేతన్‌కుమార్, గౌరవ సలహాదారుడు అమరేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ధార్మిక సమావేశంలో ప్రముఖులకు జ్ఞాపికల బహూకరణ

పురసభ ఆధ్వర్యంలో ప్రజాస్వామ్య దినోత్సవం

బంగారపేట, సెప్టెంబరు 15: అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని బంగారపేట పురసభ ఆధ్వర్యంలో ఆదివారం అర్థవంతంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి మాలార్పణ చేసిన అనంతరం రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి నేతృత్వంలో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో అసమానత తొలగేందుకు చేపట్టిన కార్యక్రమం జాతీయస్థాయిలో రికార్డు కానుందన్నారు. అన్నివర్గాల సంక్షేమానికి సీఎం సిద్దరామయ్య ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో పురసభ అధ్యక్షుడు గోవింద, తహసీల్దార్ వెంకటేశప్ప, కార్యనిర్వహణాధికారి రవికుమార్, ముఖ్యఅధికారి సత్యనారాయణ, సాంఘిక సంక్షేమ అధికారి అంజలి, తాలూకాస్థాయి అధికారులు, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మానవహారంలో ఎమ్మెల్యే నారాయణస్వామి తదితరులు

లోక్‌అదాలత్‌లో పలు కేసుల పరిష్కారం



లోక్‌అదాలత్‌లో రాజీతో ఒక్కటైన దంపతులు

శిడ్లఘట్ట, సెప్టెంబరు 15: పట్టణంలోని సీనియర్ సివిల్ కోర్టు సహా ఇతర కోర్టులలో శనివారం జాతీయ లోక్‌అదాలత్‌లో పలు కేసులు రాజీ ద్వారా పరిష్కారమయ్యాయి. సీనియర్ సివిల్ న్యాయాధికారి మహ్మద్ రోషన్‌షా మాట్లాడుతూ కొంతకాలంగా విబేధాలతో ఉన్న దంపతులను రాజీ ద్వారా కలవడం సంతోషంగా ఉందన్నారు. పిల్లల భవిష్యత్తుకోసం ఒక్కటయ్యారన్నారు. రాజీ చర్చల ద్వారా పలు సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. 278 కేసులకుగాను 166 కేసులు రాజీ ద్వారా పరిష్కారం కాగా వీటివల్ల రూ.11,87,480 ఆదాయం వచ్చిందన్నారు. ప్రధాన సివిల్ కోర్టులో 176 కేసులకుగాను 114 కేసులు రాజీతో పరిష్కారమై రూ.37,96,641 ఆదాయం వచ్చిందన్నారు. సివిల్ కోర్టులో 95 కేసులపైకి 58 కేసులో కక్షిదారులు రాజీ చేసుకున్నారన్నారు. రూ.72,500 ఆదాయం సాధ్యమైందని ఇలా శిడ్లఘట్ట కోర్టులో 300కుపైగా కేసులు పరిష్కారమయ్యాయన్నారు. అదాలత్‌లో సంధానకర్తగా న్యాయవాది డి సత్యనారాయణ, తాలూకా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎ.నారాయణస్వామి, కార్యదర్శి సి.జిభాస్కర్, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి జడ్పీ సభ్యుడు

బంగారపేట, సెప్టెంబరు 15: జిల్లా పంచాయతీ సభ్యుడు బీవి కృష్ణ జేడీఎస్ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. ఆదివారం ఎస్ఎన్ రిసార్టులో ఏర్పాటైన కార్యక్రమంలో ఎమ్మెల్యే నారాయణస్వామి నేతృత్వంలో సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. బూదికోటి హోబళికి చెందిన మాజీ ఎమ్మెల్యే వెంకటేశప్ప కుమారుడైన కృష్ణతోపాటు సుమారు 35మంది కాంగ్రెస్‌లో చేరడంపై ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు. కృష్ణ మాట్లాడుతూ కాంగ్రెస్ సిద్ధాంతాలు, ఎమ్మెల్యే అభివృద్ధి కార్యక్రమాలను చూసి పార్టీలో చేరుతున్నట్టు తెలిపారు. తాలూకా పంచాయతీ మాజీ అధ్యక్షుడు మహదేవప్ప, ఎ.బాబు, వీఎస్ఎస్ఎన్ మాజీ అధ్యక్షుడు ఆర్‌విజి కుమార్, కాంగ్రెస్ ప్రముఖులు రామ్‌శెట్టి, రమేశ్, మునిస్వామిశెట్టి తదితరులు పాల్గొన్నారు.



కృష్ణను స్వాగతిస్తున్న ఎమ్మెల్యే నారాయణస్వామి